సాక్షి చిత్తూరు

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

అమృత్ భారత్ పథకం కింద చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం ప్రారంభించారు. - 8లో



40 ఏళ్ల వ్యక్తికి గుండె మార్పిడి

తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయంలో సోమవారం ఓ 40 ఏళ్ల వ్యక్తికి గుండె మార్పిడి ఆపరేషన్ చేశారు. - 8లో



సాగుకు 'భరోసా'

రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన కింద ప్రభుత్వం వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

29న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ జట్ల ఎంపికను ఈ నెల 29వ తేదీన చేపట్టనున్నట్లు జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షులు మమత, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రరెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని నాగలాపురం బాలుర వసతి గృహం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక కోసం పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనే క్రీడాకారులు 85 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. ఆధార్ కార్డు, 8 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9440345455 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

5 నుంచి మొగిలీశ్వరుని బ్రహ్మోత్సవాలు



మొగిలీశ్వరస్వామి



కామాక్షమ్మ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన కామాక్షి సమేత శ్రీమొగిలీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను మార్చి 5 నుంచి 15వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు, ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5న అంకురార్పణ, మూషిక వాహనంపై వినాయకుని ఊరేగింపు, 6న కలశ స్థాపన, ధ్వజారోహణము, హంస వాహన సేవ, 7న అధికార నందివాహనం, సింహవాహన సేవ. 8వ తేది మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, రాత్రి లింగోద్భ అభిషేకం, వృషభ వాహనసేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 9న కైలాసగిరి రావణబ్రహ్మ వాహనం , శేషవాహనం, 10న గజవాహనం, కామధేను వాహనసేవ, 11న అభిషేకం, కల్యాణోత్సవం, అశ్వవాహనసేవ, 12న తోపు ఉత్సవం, అభిషేకం, బ్రహ్మరథోత్సవం, 13న అభిషేకం, పుష్పపల్లకి సేవ, 14న సూర్యప్రభ వాహనం, వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణము, చంద్రప్రభ వాహనసేవ, శయనోత్సవం, 15 అభిషేకం, తెపోత్సవం జరిపించనున్నట్లు వివరించారు.

29లోపు లైవ్ సర్టిఫికెట్ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెన్షనర్లు ఈ నెల 29వ తేదీ లోపు లైవ్ సర్టిఫికెట్‌ను ఆయా సబ్‌ట్రెజరీల్లో తప్పనిసరిగా అందజేయాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లైవ్ సర్టిఫికెట్ ఇవ్వనివారికి మార్చిలో పెన్షన్ నిలిపివేస్తారని వెల్లడించారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. మార్చి 6వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో 4, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో 2 పరీక్ష కేంద్రాల్లో టెట్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు చిత్తూరు, చెన్నైలలో మొత్తం 7,600 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

పకడ్బందీగా క్లెయిమ్స్ పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాకు సంబంధించి క్లెయిమ్స్‌ను పకడ్బందీగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ఫారమ్–6,7,8 క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల కసరత్తులో ఈఆర్‌ఓలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

29న మెగా జాబ్ మేళా

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈ నెల 29వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ సోమవారం తెలిపారు.ఈ జాబ్‌మేళాకు 17 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. పుత్తూరు, శ్రీకాళహస్తి, కార్వేటినగరం, సత్యవేడు కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. విద్యార్థులు రెజ్యూమ్ 3 కాపీలు, ఫొటోలు 3, విద్యా నైపుణ్యాలకు సంబంధించిన ఫొటోలు 3 కాపీలు తీసుకురావాలన్నారు. 29వ తేదీ ఉదయం 9 గంటలకు కళాశాలకు చేరుకోవాలని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





కృష్ణా జలాల విడుదలను వీక్షించేందుకు కుప్పం ఉప కాలువ గట్టుపై అశేష జనం (ఇన్‌సెట్) కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆనందపరవళ్లు

ప్రజలకు మేలు చేయాలన్న ఓ నాయకుడి ఆలోచనా విధానం.. ఓ మానవతావాది మహోన్నత ఆశయం.. ఓ సుపరిపాలకుడి నిరుపమాన సంకల్పం.. నేడు కళ్లెదుట సాక్షాత్కరించింది.. వందల కిలోమీటర్ల మేర వయ్యారాలు పోతూ.. కొండలు గుట్టలు దాటి ముందుకు సాగిన కృష్ణమ్మ ఎట్టకేలకు కరువు సీమను కరుణించింది. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు పరవళ్లు తొక్కింది. కుప్పం వాసుల దాహార్తిని తీర్చేందుకు ఉప్పొంగింది. అన్నదాతల ఆశలను నెరవేర్చేందుకు వడివడిగా చెరువులకు చేరుతోంది. వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు మార్గం సుగమం చేసింది. వలస బతుకులకు 'చంద్ర' గ్రహణం నుంచి విముక్తి కల్పించే దిశగా ఉత్సాహంగా ఉరుకుతోంది. సోమవారం రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా కుప్పం ఉప కాలువ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా విడుదలైన పవిత్ర కృష్ణా జలం.. ప్రజల్లో హర్షాతిరేకాలను ఇనుమడింపజేసింది.



వేదపండితుల ఆశీర్వచనం



జగనన్న ప్రసంగానికి ఈల వేస్తున్న చెల్లెమ్మ

- కుప్పంలో అట్టహాసంగా కృష్ణా జలాల విడుదల
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరా'జనం'
- కిలోమీటర్ల పొడవునా జేజేలు పలుకుతూ ఘన స్వాగతం
- సీఎం బహిరంగ సభకు పోటెత్తిన ప్రజానీకం
- ప్రసంగానికి ఆద్యంతం విశేష స్పందన
- తాగు.. సాగునీటి కష్టాలు తీర్చిన అపర భగీరథుడికి అభినందన
- కుప్పంపై వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి
- మరో రెండు రిజర్వాయర్లకు అనుమతులు

రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లు

కుప్పం నియోజకవర్గంలో కరువును శాశ్వతంగా రూపుమాపే దిశగా ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. కృష్ణా జలాలను నిల్వ చేసేందుకు నూతనంగా రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసినట్లు ప్రకటించారు. శాంతిపురం మండలం ముద్దనపల్లె, గుడుపల్లె మండలం యామగానిపల్లె వద్ద ఈ రిజర్వాయర్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే పాలారు ప్రాజెక్టులో భాగంగా రూ.215 కోట్లతో 0.6 టీఎంసీల సామర్థ్యం గల చిన్నపాటి రిజర్వాయర్ నిర్మాణానికి సైతం పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు.

బృహత్తర కార్యక్రమం

కృష్ణా జలాలను కుప్పం తీసుకురావడం బృహత్తర కార్యక్రమని కలెక్టర్ ఎస్ షణ్మోహన్ తెలిపారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి నీటి విడుదల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాగం నిరంతరం శ్రమించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు రెండో దశలో భాగంగా 123 కిలోమీటర్ల బ్రాంచ్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి 110 చెరువులకు నీరు నింపడం మహోత్తరమని కొనియాడారు. ఇందులో జిల్లా యంత్రాగాన్ని భాగస్వాములు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి, చిత్తూరు/శాంతిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ యావత్ కుప్పం నియోజకవర్గం తరలివచ్చింది. కిలోమీటర్ల పొడవునా ఎటుచూసినా జనమే. అన్ని దారులూ శాంతిపురం మండలంలోని గుండిశెట్టిపల్లె వద్ద ఏర్పాటు చేసిన సభ దిశగానే సాగాయి. 16 నెలల తర్వాత కుప్పానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా జనం నీరాజనాలు పట్టారు.

ఆకట్టుకున్న ప్రసంగం

సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి విశేష స్పందన లభించింది. జై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. నవరత్న పథకాల ద్వారా కుప్పం ప్రజలకు చేకూరిన లబ్ధిని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరిస్తుంటే ప్రజానీకం హర్షాతిరేకాలతో ఆలకించింది. విపక్షాలపై సంధించిన విమర్శనాస్త్రాలకు చప్పట్లతో సంపూర్ణ మద్దతు వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీ భరత్‌ను రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తామని, కుప్పం అభివృద్ధికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నామని భరోసా ఇస్తుంటే కేరింతలతో సంతోషాన్ని వెలిబుచ్చింది. మనసున్న మారాజు మా ముఖ్యమంత్రి అంటూ ఆశీర్వదించింది.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఆర్‌కే రోజా, అంబటి రాంబాబు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యేలు వెంకటేగౌడ్, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి , జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి అభిమానం



మేనమామను చూడాల్సిందే..



కృష్ణా జలాలు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగన్‌మామయ్య సభకు మేము సైతం..



చెట్టెక్కిన అభిమానం..



సభకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజానీకం

గత పాలనకు.. మీ బిడ్డ పాలనకు బేరీజు వేసుకోండి



విశేష పూజలో...

కుప్పం నియోజకవర్గంలో గత 57 నెలలుగా జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. తన పాలనకు, గతంలో చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుకోవాలని సూచించారు. కుప్పానికి కృష్ణమ్మ నీరు తీసుకొచ్చిన తర్వాతే ఓటు అడుగుతానని గతంలోనే చెప్పానని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు అరకొరగా చేసిన హంద్రీ–నీవా కాలువ పనులను పూర్తి చేసి, కుప్పానికి కృష్ణా జలాలు తీసుకువచ్చామని తెలిపారు. ఎమ్మెల్యేగా 34 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి చేయలేని పనులను సైతం తాను చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బాబు మాయమాటలకు మోసపోవద్దని సూచించారు.



జగనన్నకు జై కొడుతూ..

శాంతిపురంలోకి కృష్ణా జలాలు

శాంతిపురం: హంద్రీ–నీవా ప్రాజెక్టులోని కుప్పం కాలువ ద్వారా కృష్ణా నదీ జలాలు సోమవారం సాయంత్రం శాంతిపురం మండలంలోకి ప్రవేశించాయి. రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా నీటిని విడుదల చేశారు. ట్రయల్ రన్ కారణంగా కాలువలో అప్పటికే నీరు ఉండడంతో ఒక్క రోజులోనే జలాలు శాంతిపురం మండలానికి చేరాయి. రాజుపేట నుంచి అత్తికుప్పం, కిలాకిపోడు ప్రాంతాల మీదుగా శాంతిపురం మండలంలోని అమ్మవారిపేట, వెంకటేశపురం, దండికుప్పం, గొల్లపల్లె, సంతూరు, రామనాథపురం మీదుగా గుండిశెట్టిపల్లె ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో స్థానిక రైతులు, ప్రజలు ఆనందంతో కాలువ నీటిలో దిగి కేరింతలు కొట్టారు.



రామనాథపురం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత



సీఎం సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నేత

కుప్పం: కుప్పం పట్టణంలో టీడీపీ క్రియాశీల నాయకుడు, బలమైనా బలిజ సామాజిక వర్గానికి చెందిన వెంకటరమణ (నాను) ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన చేరారు. టీడీపీ మాజీ యువత అధ్యక్షుడిగా, కుప్పం పంచాయతీలో మూడు సార్లు వార్డు సభ్యుడిగా గెలుపొందాడు. పట్టణంలో పట్టున్న నాయకుడు నాను వైఎస్సార్ సీపీలోకి రావడంపై పార్టీ వర్గాలు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్, ఎస్పీ జాషువా, కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి

ఘన స్వాగతం.. సాదర వీడ్కోలు

రామకుప్పం: హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా కుప్పం కాలువ ద్వారా కృష్ణా జలాలను విడుదల చేసేందుకు సోమవారం మండలంలోని రాజుపేట గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘనస్వాగతం లభించింది. హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ జాషువా, సర్పంచ్ నీలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నేత మధుసూదన్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.అనంతరం కుప్పం పర్యటన ముగించుకుని తిరుగుప్రయాణమైన ముఖ్యమంత్రికి హెలీ ప్యాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు పెద్దిరెడ్డి, అంబటి రాంబాబు, సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి రేణిగుంటకు బయలుదేరి వెళ్లారు.



ముఖ్యమంత్రికి రాఖీ కడుతున్న శైలజ

చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ



మాట్లాడుతున్న ఎస్‌డీఎస్‌ఓ చంద్రశేఖర్

– వర్చువల్‌గా శ్రీకారం చుట్టిన ప్రధానమంత్రి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు సోమవారం వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమృత్ భారత్ పథకం కింద రూ.14 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ (ఎస్‌డీఎస్‌ఓ) చంద్రశేఖర్ మాట్లాడుతూ గుంతకల్లు డివిజన్ పరిధిలో మొత్తం 17 రైల్వేస్టేషన్లను ఆధునికీరించనున్నట్లు తెలిపారు. గత పదేళ్లగా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, అందుకు అనుగుణంగా రైల్వేస్టేషన్లలో వసతులు లేవన్నారు. ఈ మేరకు సరికొత్త హంగులతో రైల్వేస్టేషన్లు నిర్మించనున్నట్లు వివరించారు. మాజీ ఎంపీ దుర్గా మాట్లాడుతూ రవాణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. అనంతరం రైల్వే శాఖ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, జీఆర్‌పీ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చైతన్య, బీజేపీ నేతలు శ్రీనివాసులు, రామభద్ర, షణ్ముగం, గోకుల్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ప్రణాళిక

- 9 అంశాలతో యాక్షన్ ప్లాన్ తయారీకి మార్గదర్శకాలు
- దశలవారీగా అమలు

చిత్తూరు కార్పొరేషన్: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా పంచాయతీల్లో క్షేత్రస్థాయి అవసరాలతో పాటు 9 థీమ్‌ల అమలుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన రిసోర్స్‌పర్సన్‌కు శిక్షణ పూర్తి చేయగా మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

దశలవారీగా అమలు

జిల్లాలో 697 పంచాయతీలున్నాయి. పంచాయతీ ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తుంటారు. జనరల్ ఫండ్స్‌లో 30 శాతం సిబ్బంది జీతభత్యాల కోసం, 15 శాతం తాగునీటి అవసరాలు, 15 శాతం పారిశుద్ధ్యం నిర్వహణ, 15 శాతం వీధి లైట్ల నిర్వహణ, 10 శాతం రోడ్లు, డ్రైయిన్ల నిర్వహణ, 5 శాతం నిధులు ఈ– గవర్నెన్స్ (కంప్యూటర్లు, ఇతర సాంకేతిక అవసరాలు) కోసం వ్యయం చేయాల్సి ఉంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు, టైడ్ గ్రాంట్ 50 శాతం పారిశుద్ధ్యం, 50 శాతం తాగునీటి అవసరాలకు వెచ్చించాలి. అన్ టైడ్ గ్రాంట్ స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

9 అంశాలతో అభివృద్ధి

1. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగి ఉండడం
2. ఆరోగ్యవంతమైనది
3. బాలలకు స్నేహపూర్వక వాతవారణం కల్పించడం
4. నీటి సమృద్ధి
5. పరిశుభ్రత, పచ్చదనం
6. స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాల కల్పన
7. సామాజిక న్యాయం, సామాజిక భద్రత కల్పన
8. సుపరిపాలనలో కూడినది
9. మహిళలకు స్నేహ పూర్వకమైనది

ఈ తొమ్మిది అంశాలు ప్రాతిపదికగా జిల్లాలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలి. ఈ అంశాల్లో ఏదో ఒక అంశాన్ని ప్రతి గ్రామ పంచాయతీ తప్పనిసరిగా ఎంచుకుని, ఆ మేరకు అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రతి పంచాయతీ కనిష్టంగా ఒకటి, గరిష్టంగా రెండు అంశాలను ఎంచుకుని ప్రణాళికను తయారు చేసుకోవచ్చు. 2030లోగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా అంశాలను ఎంచుకుని ప్రణాళిక ప్రకారం గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నది దీని ముఖ్య ఉద్దేశం. ఫిబ్రవరి 1 నుంచి 29 తేదీలోగా మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) తయారు చేయాల్సి ఉంటుంది. అలాగే జిల్లా పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికలను కూడా ఆమోదించాల్సి ఉంటుంది.

ప్రణాళిక ముఖ్యం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు జీపీడీపీలను రూపొందిస్తాం. ఈ ప్రణాళిక మేరకు నిధులు విడుదలవుతాయి. జీపీడీపీ రూపకల్పనపై ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన అధికారులకు శిక్షణ ఇచ్చాం. మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నాం.

- లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

వ్యక్తి ఆత్మహత్య



వెంకటేశప్ప మృతదేహం

పెద్దపంజాణి : మండలంలోని బట్టండొద్ది పంచాయతీ శ్రీరామాపురంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లా కుదిరేబాల్య గ్రామానికి చెందిన వెంకటేశప్ప(55) అనే వ్యక్తి శ్రీరామాపురం సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపర్లు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

40 ఏళ్ల వ్యక్తికి గుండె మార్పిడి

తిరుపతి తుడా: టీటీడీ శ్రీ పద్మావతీ హృదయాలయంలో 12వ గుండె మార్పిడిని విజయవంతంగా చేపట్టారు. 40 ఏళ్ల వ్యక్తికి 28 ఏళ్ల యువకుడి గుండెను వైద్యులు అమర్చారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని వైద్యుల బృందం సోమవారం 6 గంటలకు పైగా శ్రమించి గుండె మార్పిడి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

విజయవంతంగా : విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల యువకుడు గుండె సంబంధిత సమస్యతో వైద్యం చేయించుకుంటున్నారు. రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలియడంతో కుటుంబ సభ్యులు పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌ను ఆశ్రయించారు. ఎరీక్షించిన వైద్యులు గుండె క్షీణించి సామర్థ్యం కోల్పోయినట్లు నిర్ధారించారు. గుండె మార్పిడి అనివార్యమని తేల్చారు. 10 రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. జీవన్‌దాన్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న వైద్యుల బృందం శ్రీకాకుళం వెళ్లి గుండెను సేకరించారు. ఆ గుండెను మార్పిడి చేశారు.

సాగుకు 'భరోసా'

అన్నదాతలకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వ్యవసాయానికి భరోసా కల్పిస్తోంది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు ముందస్తు పెట్టుబడిని అందించి ఆదుకుంటోంది. సున్నా వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయిస్తోంది. ఈ క్రమంలోనే ఈ–క్రాప్ విధానంతో ఉచిత బీమా సౌకర్యం అందిస్తోంది. రైతులకు అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తోంది. సాగును సంబరంగా మారుస్తోంది.



లబ్ధిదారులకు మెగా చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

- రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం
- వ్యవసాయానికి పెట్టుబడి సాయం
- సున్నా వడ్డీ రుణాలతో సహకారం
- పంటలకు ఉచిత బీమా సౌకర్యం
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై అన్నదాతల ఆనందం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో దాదాపు 3.10 లక్షల మంది అన్నదాలు, మొత్తం 2.30 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 1.30 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అందులో ఖరీఫ్ సీజనులో 1.03 లక్షల హెక్టార్ల మేరకు సాగులోకి తీసుకువస్తున్నారు. ప్రధానంగా వర్షాధార పంటగా వేరుశనగను 60 వేల హెక్టార్ల మేరకు సాగు చేస్తున్నారు. రబీ సీజనులో27 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను పండిస్తున్నారు. ఇవిగాక ఉద్యాన పంటలను ఏటా దాదాపు 1.20 లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా మామిడి 68 వేల హెక్టార్లలో సాగులో ఉంటోంది. ఈ క్రమంలో అన్నదాతలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

గతంలో అన్నీ అవస్థలే..

గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అన్నీ అవస్థలే ఎదురయ్యేవి. పంటల సాగుకు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా రుణాలు అందేవి కావు. విధిలేక ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి. తీరా పంటల దిగుబడి ఆశించిన మేరకు రాక ఆత్మహత్యలే శరణ్యమయ్యేవి. .ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతిన్నా ఎలాంటి ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు దక్కేది కాదు. దీంతో రైతులు వ్యవసాయం వదులుకునే పరిస్థితి ఉండేది.

నేడు సంబరంగా సాగు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది. రైతులను అన్ని విధాలా ఆదుకుంటూ, ఆర్థిక తోడ్పాటుకు చర్యలు చేపట్టింది.ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు ముందస్తుగానే ప్రతి రైతు కుటుంబానికి రైతు భరోసా, పీఎం కిసాన్ కింద రూ. 13,500 చొప్పున అందించి ఆదుకుంటోంది. ద జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో 2,32,693 రైతు కుటుంబాలకు ఇప్పటికి రూ. 1,423.88 కోట్ల మేరకు అందించింది. బ్యాంకుల ద్వారా ప్రతి రైతుకు రూ. లక్ష వరకు వడ్డీలేని రుణాలను అందించే ప్రక్రియను చేపట్టింది. దీంతో ఐదేళ్లుగా ఇప్పటికి 34,596 మంది రైతులకు రూ.8.33 కోట్ల మేరకు వడ్డీ మొత్తాలను ప్రభుత్వం చెల్లించింది. మొత్తం 1,53,639 మంది రైతులకు రూ. 52.72 కోట్ల మేరకు నష్టపోయిన పంటలకు బీమా మొత్తాలను అందజేసింది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద మొత్తం 36,946 మంది రైతులకు రూ.16.17 కోట్లను అందించి ఆదుకుంది.

రైతుభరోసా సమాచారం

సంవత్సరం	రైతు కుటుంబాలు	లబ్ధి పొందిన మొత్తం (రూ. కోట్లలో)
2019- 20	2,20,256	294 .94
2020-21	2,31,083	290 .80
2021-22	2,16,594	242 .01
2022-23	2,23,165	331 .08
2023-24	2,31,144	265 .05

(రెండు విడతల్లో)

అండగా ప్రభుత్వం



పంటల సాగుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏటా రైతు భరోసా పథకం ద్వారా పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని అందించి ఆదుకోవడం సంతోషంగా ఉంది. దీంతో అధిక వడ్డీలకు అప్పుల చేసే తిప్పలు తప్పాయి. ప్రభుత్వ సహకారంతో సకాలంలో పంటలను సాగులోకి తీసుకువస్తున్నాం.

- ధనంజయరెడ్డి, రైతు, ఎస్‌కేఆర్ పురం, పాలసముద్రం మండలం

రైతుల పాలిట వరం



రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం రైతుల పాలిట వరం. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఆనందంగా పంటలను సాగు చేస్తున్నాం . ముఖ్యంగా సున్నావడ్డీ రుణాలు మాలాంటి మధ్యతరగతి రైతులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి.

- జి.వెంకటరమణ, రైతు, వడ్డిపల్లె, పెద్దపంజాణి మండలం

గతంలో అప్పులే..



గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి ఎలాంటి సహకారం ఉండేది కాదు. అప్పులు చేసి ఎంతో కష్టపడి సాగులోకి తీసుకు వచ్చిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినా ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం పంటలకు బీమా సౌకర్యం ఉండకపోగా, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందేది కాదు.

- అంజప్పగౌడ్, రైతు, రామనపల్లె, బైరెడ్డిపల్లె మండలం


ఆర్థిక తోడ్పాటు.



రైతులకు పంటల సాగులో క్రమం తప్పకుండా ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. ముందస్తుగానే రైతు భరోసా కింద పెట్టుబడి నిధిని అందించింది. ఉచిత బీమా సౌకర్యంతోపాటు, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందిస్తోంది. వ్యవసాయం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయం.

- సుందర్‌రాజు, రైతు, రాచపాళ్యం, పాలసముద్రం మండలం

రుణపడి ఉంటాం...



గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం చేసేందుకే భయపడే పరిస్థితి. ఇప్పుడు వ్యవసాయానికి అందిస్తున్న తోడ్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. ముందస్తుగానే పెట్టుబడి నిధి అందిస్తుండడంతో ఎంతో ఉత్సాహంగా పంటలను సాగులోకి దిగుతున్నాం.

- జయరామ్‌రెడ్డి , రైతు, నడింపల్లె, పూతలపట్టు మండలం

రుణ బాధలు తప్పాయి



పంటల సాగుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో మాకు రుణ బాధలు తప్పాయి. గతంలో అధిక వడ్డీలతో అప్పులు చేసి పంటలు సాగు చేసేవాళ్లం. దురదృష్టవశాత్తు పంట నష్టపోతే వడ్డీలు కూడా చెల్లించలేక నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు ఆశించిన మేరకు దిగుబడి అందకపోయినా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. - వరదరాజులు , రైతు, గుడిపాల మండలం